సాక్షి
ఖమ్మం
బుధవారం ; 21 ; జూన్ ; 2023



ఆలయాల్లో కొత్త కాంతులు
ఉమ్మడి జిల్లాలోని పలు పురాతన ఆలయాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి. డీడీఎన్ పథకం నిధులతో పూజలు సాఫీగా సాగుతున్నాయి. 10లో



జీవనవిధానంగా యోగా!
కరోనా తర్వాత ఆరోగ్యంపై శ్రద్ధ పెరగగా.. పలువురు యోగా సాధన చేయడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
39° / 26°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నేడు హైదరాబాద్‌కు పొంగులేటి అనుచరులు

- రేవంత్‌రెడ్డితో భేటీ కానున్న మాజీ ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు బుధవారం హైదరాబాద్ వెళ్లనున్నారు. ఈనెల 9న ఖమ్మంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అనుచరులతో సమావేశమైన పొంగులేటి ఏ పార్టీలో చేరాలన్న అంశంపై చర్చించిన విషయం విదితమే. ఈసందర్భంగా ఎక్కువమంది కాంగ్రెస్‌లోనే చేరాలని అభిప్రాయం వెల్లడించగా, ఆయన ఆ దిశగానే అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పొంగులేటి భేటీ కానున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యాన ఆయన ఉమ్మడి జిల్లాకు చెందిన అనుచరులతో సమావేశం కానున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ మండలం నుండి పది మంది చొప్పున హైదరాబాద్ రావాలని పొంగులేటి నుంచి ఆహ్వానం పంపించారు.

కళాశాలలో కనీస వసతులు కల్పించాలి

ఖమ్మంలీగల్: కళాశాలలో విద్యార్థినులు ఇబ్బంది పడకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయమూర్తి మంగళవారం ఖమ్మం మహిళా జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. టాయిలెట్లు, తాగునీటి వసతి ఇతర అంశాలపై సూచనలు చేశారు. జిల్లాలోని మిగతా విద్యాసంస్థలను కూడా తనిఖీ చేసి హైకోర్టుకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

46 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 110 మంది దివ్యాంగులు హాజరుకాగా వైద్యులు పరీక్షలు చేసి 46 మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా గుర్తించారు.

జిల్లాలో పలువురు ఎస్సైల అటాచ్‌మెంట్

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు ఎస్సైలకు వివిధ పోలీస్ స్టేషన్లలో అటాచ్‌మెంట్ ఇస్తూ సీపీ విష్ణు ఎస్.వారియర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బి.సాయికుమార్‌ను బోనకల్, బోనకల్‌లో విధులు నిర్వర్తిస్తున్న కవితను మధిర అడిషనల్ ఎస్ఐగా, మధిరలో పనిచేస్తున్న స్వప్నను ఖమ్మం వీఆర్‌కు కేటాయించారు. అలాగే, ఖమ్మం టూటౌన్‌లో పనిచేస్తున్న మేడా ప్రసాద్‌ను వైరాకు, అక్కడ పనిచేస్తున్న వీరప్రసాద్‌ను ఖమ్మం టూ టౌన్‌కు, ఖమ్మం త్రీ టౌన్‌లో పనిచేస్తున్న రఫీని మధిర రూరల్‌కు అటాచ్‌మెంట్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు జెడ్పీ ప్రత్యేక సమావేశం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22వ తేదీన అమరవీరుల సంస్మరణను పురస్కరించుకుని జెడ్పీలో ప్రత్యేక సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు ఒక ప్రకటనలో వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నవీన్‌బాబు

- మాతృశాఖకు ఏలూరి శ్రీనివాసరావు


నవీన్ బాబు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె.నవీన్‌బాబును నియమిస్తూ శాఖ ఎండీ కరుణాకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈడీగా విధులు నిర్వర్తిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు డిప్యూటేషన్‌ను రద్దు చేయగా, కొత్త వారిని నియమించే వరకు ఎస్సీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్‌బాబుకు బాధ్యతలు అప్పగించారు. కాగా, బుధవారం శ్రీనివాసరావును ఈడీ బాధ్యతల నుండి రిలీవ్ చేయనున్నట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఏలూరి శ్రీనివాసరావును ప్రభుత్వం గత ఏడాది జూన్ 13న డిప్యూటేషన్‌పై ఖమ్మం ఈడీగా నియమించింది. ఈనెల 17న ఆయన డిప్యూటేషన్‌ను పొడిగించడంలేదని తిరిగి పంచాయతీరాజ్ శాఖకు పంపించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎస్సీ కార్పొరేషన్ ఎండీ కరుణాకర్‌కు లేఖ పంపించగా ఆయన నవీన్‌బాబుకు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈడీగా శ్రీనివాసరావు రిలీవ్ అయ్యాక పీఆర్ కమిషనర్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంది.

పాలేరు.. షాడోస్!

- నియోజకవర్గంలో ఏదో ఒకచోట ఉద్రిక్త పరిస్థితులు
- రెండు మండలాల్లో ఆ నేతలు చెప్పిందే శాసనం
- అధికారుల విధులకూ ఆటంకం కలిగిస్తున్న వైనం
- ఎమ్మెల్యే ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహారం ఉందంటూ పార్టీలో ప్రచారం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాలేరు నియోజకవర్గంలో అధికార పార్టీలోని చోటానేతల పెత్తనం హద్దులు దాటుతోందన్న ప్రచారం సాగుతోంది. నిత్యం ఏదో ఒకచోట ఉద్రిక్తత పెంచేలా ఉన్న వీరి వ్యవహారం శ్రుతి మించుతుండడం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చకు దారి తీస్తోంది. అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు వారిని ఏకవచనంతో సంభోదిస్తూ పెత్తనానికి యత్నిస్తున్నట్లు చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొందరు నేతల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోవడంతో ఎమ్మెల్యే ప్రతిష్ట దెబ్బతినే పరిస్థితి నెలకొందని పార్టీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలోని రెండు మండలాలకు సంబంధించిన ఇద్దరు లీడర్లు మరీ దూకుడుగా ఉండగా.. నాలుగు మండలాల్లో ఎమ్మెల్యే షాడోస్‌గా సదరు నేతలు అవతారం ఎత్తారనే ప్రచారం ఎక్కువైంది.

ఎమ్మెల్యేకు మచ్చ తెచ్చేలా..

ఇటీవల పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కార్యక్రమాల జోరు పెంచారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇలా ఆయన ఎన్నికలకు సిద్ధమవుతుండగా.. మరోవైపు కొందరు నేతల వ్యవహార శైలి ఆయనకు మచ్చ తెస్తోందని పార్టీ నేతల్లోనే ప్రచారం కొనసాగుతోంది. ఈ నేతల వ్యవహారం తారాస్థాయికి చేరడంతో కిందిస్థాయి నేతలు విసిగిపోతున్నట్లు సమాచారం. ఇక ఆయా కేడర్ మండల స్థాయి అధికారులను కూడా ఏకవచనంతో సంభోదిస్తూ పెత్తనం చెలాయిస్తుండడంతో పలువురు ఉద్యోగులు మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిసింది.

■ ఖమ్మం రూరల్ మండలంలోని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. ఆయన మాట వినని అధికారులను బదిలీ చేయించడం లేదంటే బెదిరించడం పరిపాటిగా మారింది. దేవాదాయ శాఖకు చెందిన మహిళా అధికారిని దూషించగా ఆమె బాధ చెప్పుకున్న వీడియోలు వైరల్ అయ్యాయి. అంతేకాక వేధింపులు తట్టుకోలేక నిద్రమాత్రలు కూడా మింగారు. అలాగే తన మాట వినని మండల స్థాయి అధికారి, పోలీస్ ఉన్నతాధికారిని బదిలీ చేయించారని ప్రచారం ఉంది. ఈ నేత ఆగడాలు నానాటికీ పెరుగుతుండడంతో కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన బ్రేక్ వేసినట్లు తెలిసింది. సదరు నేతను మందలించడమే కాక ఖమ్మంరూరల్ మండలంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ప్రతీ అంశాన్ని స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.

■ కూసుమంచి మండలంలో మరో నేత పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలోని ఇతర నాయకులను ఎమ్మెల్యే దరి చేరనివ్వకుండా తానొక్కడే అన్ని వ్యవహారాలు చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారని చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మండల నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పలుమార్లు ఘర్షణలకు కూడా దిగారు. గతంలో క్యాంపు కార్యాలయంలోనే పరస్పరం దాడులకు దిగడం గమనార్హం. సదరు నాయకుడు ఇటీవల సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదు. అలాగే, ఫ్లెక్సీల ఏర్పాటుపై రగడ నెలకొనగా ఎమ్మెల్యే సర్దిచెప్పినట్లు సమాచారం. మండల స్థాయి పదవులు ఉన్న వారిని సైతం సదరు నేత పక్కన పెట్టి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఫలితంగా ఈయనతో ఎమ్మెల్యే సొంత గ్రామానికి చెందిన నేతకు వైరం పెరిగిందని సమాచారం. ఓ గ్రామంలో జరిగిన గొడవకు కూడా సదరు నాయకుడే ఆజ్యం పోశాడన్న ఆరోపణలున్నాయి.

■ వీరే కాకుండా నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోనూ కొందరు నాయకులు ఎమ్మెల్యే పేరు చెప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నేలకొండపల్లి మండలంలో వెంచర్ల నిర్వహణలో వీరే ప్రధానపాత్ర పోషిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు అడ్డుకుంటున్నా పట్టించుకోవడం లేదని సమాచారం. అంతేకాక పలు ఘటనల్లోనూ జోక్యం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక తిరుమలాయపాలెం మండలంలో కూడా ఇద్దరు నాయకులు ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారు.

‘మన బడి’తో ఆత్మసంతృప్తి


మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ మధు, మేయర్ నీరజ, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, డీఈఓ శర్మ తదితరులు

- సుమారు రూ.150కోట్లతో బడులను అభివృద్ధి చేశాం..
- విద్యా దినోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


హెచ్‌ఎంను సన్మానిస్తున్న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ, కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపర్చే క్రమంలో నియమించిన కేబినెట్ సబ్‌కమిటీలో సభ్యుడిగా ఉండడం తనకు ఆత్మసంతృప్తిని మిగిల్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పువ్వాడ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మన ఊరు – మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు రూ.150కోట్ల మేర నిధులు వెచ్చించామని తెలిపారు. గత 75ఏళ్ల పాలనలో ఏ ప్రభుత్వాలు ఇలా చేయలేదని గుర్తు చేశారు. తరగతి గదులు, డ్యూయల్ డెస్కులు, తాగునీటి సౌకర్యం ఇలా అన్ని వసతులు సమకూరాయని చెప్పారు. కాగా, బడిబాట ద్వారా గతంలో కంటే ప్రవేశాల సంఖ్య పెంచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంలో అదే శ్రద్ధ కనబర్చాలని కోరారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాక విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. అంతేకాక 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు బోధించేందుకు డిజిటల్ టీవీలు సమకూర్చామన్నారు. ఆయా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధికి మూలకారణం విద్యేనని, తెలంగాణ వచ్చాక ప్రభుత్వ రంగంలో విద్యాభివృద్ధి గణనీయంగా నమోదైందని చెప్పారు. అనంతరం పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలు, 10జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించడంతో పాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పుస్తకాలు అందించారు. డీఈఓ సోమశేఖరశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, కార్పొరేటర్ శ్రీవిద్య, డీఐఈఓ రవిబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత నగరంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.46.06లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు.

కమ్మిన కారు మబ్బులు!


చాన్నాళ్ల తర్వాత జిల్లాలో ఎండ కాస్త తగ్గుముఖం పట్టింది. జిల్లా కేంద్రంలో మంగళవారం రోజంతా సూర్యుడు దోబూచులాడగా.. ఉష్ణోగ్రత తక్కువగానే నమోదైంది.– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రైల్వే విద్యుత్ లైన్లకు మరమ్మతులు

'శాతవాహన' ఘటనతో రంగంలోకి అధికారులు

మధిర: సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు సోమవారం రాత్రి మధిర రైల్వేస్టేషన్ సమీపాన ముప్పు తప్పిన విషయం విదితమే. శాతవాహన ఎక్స్‌ప్రెస్ బోగీలపై బ్రాకెట్ ఇన్సులేటర్లు తెగిపడగా మంటలు రావడంతో ప్రయాణికులు ఉరుకులు, పరుగులు తీశారు. ఈక్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా శాతవాహనతో పాటు ఇతర రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అప్పటికప్పుడు రెండు గంటలపాటు శ్రమించిన రైల్వే సిబ్బంది తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఇక రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం ఉదయమే మధిర రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఉద్యోగులు ఘటనాస్థలం వద్ద పరిశీలించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. అలాగే, బ్రాకెట్ ఇన్సులేటర్లు తెగిపడడానికి కారణాలు తెలుసుకునేందుకు నిశితంగా పరిశీలించారు.


లైన్ మరమ్మతు చేస్తున్న ఉద్యోగులు

ఉరుములు, మెరుపులు, జల్లులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో పలుచోట్ల మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పొరుగు రాష్ట్రమైన ఏపీలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రభావం జిల్లాపై కనిపించింది. తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కల్లూరు, పెనుబల్లి, ఎర్రుపాలెం తల్లాడ తదితర మండలాల్లో వర్షం కురవడంతో వాతావరణం కొంతమేర చల్లబడింది. అలాగే, ఉష్ణోగ్రతల ప్రభావం కూడా తగ్గింది. కాగా, రైతులు విత్తనాలు నాటేందుకు ఇరవై రోజుల నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వానలపై ఆశతో అక్కడక్కడా నల్లరేగడి నేలల్లో పొడి దుక్కుల్లో పత్తి గింజలు నాటినా ఎండ కారణంగా ఫలితం కానరాలేదు. ప్రస్తుతం జల్లులు మొదలుకాగా, వర్షాలు ఊపందుకుంటాయని రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు మాత్రం కనీసం 60 మి.మీ.ల వర్షపాతం నమోదైతేనే విత్తనాలు నాటాలని సూచిస్తున్నారు.

ఆర్థిక సాయానికి ముగిసిన గడువు

రాత్రి 9 గంటల వరకు 25,810 దరఖాస్తులు



ఖమ్మంమయూరిసెంటర్: బీసీల్లో చేతి, కుల వృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ప్రకటించి ఈనెల 6వ తేదీ నుండి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈమేరకు మంగళవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించగా, రాత్రి 9 గంటల వరకు 25,810 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రాత్రి 12 గంటల వరకు గడువు ఉండడంతో దరఖాస్తులు సంఖ్య మరింత పెరుగుతుందని చెబుతున్నారు. చాలామందికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోయినట్లు తెలిసింది. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను బుధవారం నుండి మండల, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు.

మండలాల వారీగా దరఖాస్తులు...

రూ.లక్ష ఆర్థిక సాయం కుల, చేతివృత్తులు వారు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. మంగళవారం రాత్రి 9గంటల వరకు అందిన సమాచారం మేరకు అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలం నుంచి 2,022 దరఖాస్తులు అందాయి. ఇక కేఎంసీ పరిధిలో 1,709, కొణిజర్ల మండలంలో 1,448, చింతకాని మండలంలో 1,406, నేలకొండపల్లి మండలంలో 1,391, తల్లాడ మండలంలో 1,347, కూసుమంచి మండలంలో 1,316 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, ముదిగొండ మండలంలో 1,279, తిరుమలాయపాలెంలో 1,251, పెనుబల్లిలో 1,045, రఘునాథపాలెంలో 1,026, కామేపల్లిలో 941, బోనకల్‌లో 934, కల్లూరులో 920, వేంసూరులో 858, ఎర్రుపాలెంలో 857, మధిర మున్సిపాలిటీలో 822, వైరాలో 821, ఖమ్మం రూరల్‌లో 769, ఏన్కూరు మండలంలో 702 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక సత్తుపల్లి మున్సిపాలిటీలో 686, వైరా మున్సిపాలిటీలో 675, మధిర అర్బన్‌లో 650, సత్తుపల్లి అర్బన్‌లో 456, సింగరేణి మండలంలో 479దరఖాస్తులు అందాయి.

క్లుప్తంగా

నేడు జిల్లాలో ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో పర్యటించనున్న ఆయన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. కాగా, బుధవారం నిర్వహించనున్న ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీ నామ ఒక ప్రకటనలో కోరారు.

జేవీఆర్ ఓసీలో జీఎం తనిఖీ



జీఎంను సన్మానిస్తున్న పీఓ వెంకటాచారి, అధికారులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం.షాలెం రాజు మంగళవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో తనిఖీ చేశారు. అధికారులతో సమావేశమై ఉత్పత్తి, ఉత్పాదకతలపై సూచనలు చేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేస్తూనే కార్మికుల రక్షణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా జీఎం షాలెం రాజును అధికారులు సన్మానించారు. ఏజీఎం వై.రఘురామిరెడ్డితో పాటు అధికారులు కోటిరెడ్డి, వెంకటాచారి, నర్సింహారావు, వీరయ్య, లక్ష్మణ్‌మూర్తి, దుర్గాప్రసాద్, మదీనాబాషా, కె.రాందాస్, పి.శ్రీనివాస్, రాకేష్, గౌతమ్, రాజేష్‌రెడ్డి, దేవదాసు, గంగాధర్, పూర్ణచంద్రరావు, మనోహర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన రేణుకాచౌదరి



ఖర్గేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేంద్ర మాజీ మంత్రి

ఖమ్మం సహకారనగర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి ఢిల్లీలోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్రస్థాయి రాజకీయాలు, పార్టీ పరిస్థితులపై చర్చించారు.

హెచ్‌ఎంపై గ్రామస్తుల దాడి

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌పై మంగళవారం పలువురు గ్రామస్తులు దాడికి పాల్పడగా ఆయన కాలు విరిగింది. వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో విద్యాదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని అదనపు గదులు, తాగునీటి కుళాయిలను ప్రారంభించి వెళ్లారు. ఆతర్వాత స్టేజీపై ఉన్న హెచ్‌ఎంతో కొందరు గ్రామస్తులు పాఠశాల నిర్వహణ విషయమై వాగ్వాదానికి దిగగా జరిగిన తోపులాటలో హెచ్‌ఎం కింద పడ్డాడు. గ్రామంలో రాజకీయ వైరుధ్యాలతోనే కొందరు హెచ్‌ఎంపై దాడికి దిగినట్లు సమాచారం. కాగా ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జేసీబీ తగిలి రైతు మృతి



నర్సింహారావు (ఫైల్)

వైరారూరల్: మండలంలోని కోస్తాల సమీపంలో వైరా రిజర్వాయర్ కుడి కాల్వ ఏడో నంబర్ తూము వద్ద పనులు చేస్తున్న జేసీబీ తగలడంతో వైరాకు చెందిన రైతు ఉయ్యూరు నరసింహారావు(69) మృతి చెందాడు. కాల్వ తూము శిథిలావస్థకు చేరడంతో నీటిపారుదల శాఖ ఆధ్వర్యాన మంగళవారం కొత్త తూము ఏర్పాటుకు పనులు చేపట్టారు. అదే సమయాన అక్కడి పొలంలో కూరగాయల సాగు చేసే నర్సింహారావు పని జరిగే ప్రదేశానికి వెళ్లగా ప్రమాదశాత్తు జేసీబీ టైరు బలంగా తాకింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. నర్సింహారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'అన్నం' ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మార్చురీలో ఉన్న ఇద్దరి మృతదేహాలకు మంగళవారం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన బల్లేపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి ఆరేమండ హరిబాబు(90) భార్య చనిపోయినప్పటి నుంచి ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆయన అనారోగ్య కారణాలతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే, ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ ఇటీవల ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మృతి చెందగా కుటుంబీకులు స్వస్థలానికి తీసుకెళ్లే స్తోమత లేదని చెప్పారు. దీంతో హరిబాబుతోపాటు వలస కూలీల మృతదేహాలకు అన్నం ఫౌండేషన్ బాధ్యులు పోలీసుల అనుమతితో అంత్యక్రియలు నిర్వహించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

జీవనవిధానంగా యోగా!



- నిత్యం సాధనతో ఆరోగ్యం, శరీరంపై పట్టు
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఖమ్మం స్పోర్ట్స్/కల్లూరు: ఒకప్పుడు యోగా అనేది రుషులు మాత్రమే ప్రక్రియగానే భావించేవారు. కానీ యోగా సాధన, నిత్యం ఆసనాలు వేయడం ద్వారా కలిగి లాభాలపై అవగాహన పెరగడంతో వయోబేధం లేకుండా అందరూ యోగా సాధన చేస్తున్నారు. దీంతో కేంద్రప్రభుత్వం ఏటా జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించింది. ఈ క్రమంలో బుధవారం యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తొమ్మిదేళ్లలో పెరిగిన ఆసక్తి

గతంలో యోగాపై పెద్దగా ఎవరికీ ఆసక్తి ఉండేది కాదు. చాలా తక్కువ మంది మాత్రమే సాధన చేసేవారు. కానీ జూన్ 21న యోగా దినోత్సవంగా ప్రకటించాక పలువురు శిక్షణ ఇస్తుండడం, నిత్య సాధనతో కలిగే లాభాలపై అవగాహన పెరగడంతో అందరూ ముందుకొస్తున్నారు. జిల్లాలో యోగా అసోసియేషన్ ద్వారా ప్రత్యేక శిక్షన ఇస్తున్నారు. ఇక యోగాపై రీసెర్చ్ చేసేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రత్యేక కోర్సు ప్రవేశపెట్టగా మంచి ఆదరణ లభిస్తోంది. అలాగే, పలువురు పీహెచ్‌డీ కూడా సాధించారు.

జిల్లావ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని విద్యాసంస్థల్లోనే కాక ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు యోగాతో లాభాలపై ప్రచారం చేస్తుండగా.. ప్రభుత్వ అధికారులు కూడా యోగా దినోత్సవంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈమేరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉదయం 6.30గంటలకు యోగా దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు.

అనేక లాభాలు

మనిషి చేయగలిగే వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానంలో నిలుస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో యోగాను మించిన మార్గం లేదని నిపుణులు చెబుతారు. రోజుకు 20నుంచి 30 నిమిషాల పాటు యోగా చేస్తే కండరాలు ధృడంగా మారతాయని, మనస్సుకు ప్రశాంతత లభిస్తుందంటారు. ఇంకా అనేక లాభాలు ఉన్న యోగాపై కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో ఏడేళ్లుగా ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు శిక్షణ ఇస్తున్నారు.



కల్లూరులో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా వల్ల సంపూర్ణ ఆర్యోగం సమకూరుతుంది. అందరూ ప్రతిరోజు కాస్త సమయం కేటాయించి యోగా సాధన చేస్తే మంచిది. ఇందుకోసం ప్రధానంగా ఆహార నియమాలు పాటించాల్సి ఉంటుంది. వయోబేధం లేకుండా ఎవరైనా సరే నిపుణుల పర్యవేక్షణలో యోగా సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– ఎం.పరంధామరెడ్డి, డీవైఎస్ఓ

కరోనా తర్వాత నుంచి చేస్తున్నాం



కరోనా కాలం నుంచి నిత్యం యోగా చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నాం. తద్వారా మంచి వ్యాయామం చేసినట్లవుతోంది. అంతేకాక రోజంతా చురుగ్గా ఉండడానికి, పనులు చేసుకోవడడం సులువవుతోంది. నేను మాత్రమే కాదు మా ఇంట్లో అందరం ఎన్ని పనులు ఉన్నా నిత్యం యోగా సాధన చేస్తాం.

– వంశీప్రియ, లెక్చరర్, ఖమ్మం

నిత్యం సాధన చేస్తే ఫలితం



రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యం మన సొంతం అవుతుంది. మా ఫ్యాక్టరీ ఆవరణలో రోజూ యోగా శిక్షణ ఇస్తున్నాం. మొత్తంగా 50 మంది సభ్యులు ఉండగా.. దాదాపు అందరూ హాజరవుతారు. వీరిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, యువకులు ఇలా అన్ని వర్గాల వారు ఆసక్తిగా వస్తున్నారు.

– కొడాలి రఘునాథబాబు, యోగా గురువు, కల్లూరు

పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: పోడు సాగు చేసుకుంటున్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం సుందరయ్య భవనంలో జరిగిన పార్టీ వైరా నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో పోడు రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గిరిజనులకు పట్టాలు రావడానికి సీపీఎం, గిరిజన సంఘాల పోరాటమే కారణమని తెలిపారు. కాగా, రైతుల రూ.లక్ష రుణమాఫీని కూడా ప్రభుత్వం వెంటనే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, దొంతబోయిన నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, కె.నరేంద్ర, చెరుకుమల్లి కుటుంబరావు, వజ్జా రామారావు, ఏర్పుల రాములు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

ఖమ్మంగాంధీచౌక్: అంగనవాడీల లబ్ధిదారులకు నాణ్యమైన సేవలందించాలని జిల్లా సంక్షేమ అధికారి జి.జ్యోతి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె సీడీపీఓలు, ఇతర ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేశారు. క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ సేవలు లబ్ధిదారులకు చేరేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. అలాగే, 'అంగన్‌వాడీ బడిబాట'ను విజయవంతంగా నిర్వహించాలని, ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో ఇచ్చే శిక్షణకు టీచర్లు హాజరు కావాలని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా అమ్ముతున్న విత్తనాలు స్వాధీనం



విత్తనాలతో పట్టుబడిన వ్యక్తితో అధికారులు

కొణిజర్ల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పత్తి విత్తనాలు విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొణిజర్ల ఏఓ బాలాజీ వెల్లడించిన వివరాలు... కొణిజర్లకు చెందిన కె.సుధాకర్ కామేపల్లి మండలం ముచ్చర్లలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణం నుంచి పత్తి విత్తన ప్యాకెట్లు తీసుకొచ్చి బిల్లులు లేకుండా అమ్ముతున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా 179 ప్యాకెట్లు రైతుల పేరిట కొన్నట్లు బిల్లులు ఉన్నా 15 ప్యాకెట్లు మాత్రమే లభించాయి. దీంతో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల చేరుకుని వివరాలు ఆరా తీశారు. రైతులు అనుమతి ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, పంట కాలం పూర్తయ్యే వరకు రశీదులు భద్రపర్చాలని సూచించారు. కాగా, అనుమతి లేకుండా విత్తనాలు అమ్ముతున్న సుధాకర్‌తో మరొకరిని పోలీసులు అప్పగించగా కేసు నమోదు చేశారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్, ఏఎస్సైరామారావు, ఏడీఏలు సరిత, బాబూరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని నేలకొండపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేలకొండపల్లి నుంచి వాహనంలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో సుర్దేపల్లి సమీపాన వాహనాన్ని అడ్డుకుని తనిఖీలు చేయగా పది క్వింటాళ్ల బియ్యం లభ్యమయ్యాయి. అలాగే, అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తిరమాలయపాలెం ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ ఆధ్వర్యాన సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తిరుమలాయపాలెంకు చెందిన పోలెబోయిన శ్యామ్ నుండి సేకరించిన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అల్లుపల్లి రాములు, చిక్కుపల్లి శివ ములకలపల్లికి తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా బియ్యం స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబుకు అప్పగించడంతో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అలరించిన 'ఘంటసాల' నాటిక



నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన ఘంటసాల నాటిక అలరించింది. స్టేషన్ ఘనపూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్యమండలి బాధ్యులు ఈ నాటికను ప్రదర్శించారు. ప్రదర్శనను అయితరాజు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ అయితరాజు సతీష్, పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కాగా, నాటికకు భాస్కరుని సత్యజగదీష్ దర్శకత్వం వహించగా సురభి సింధూరి, కొండల్ రావు, ఇనపనూని ఇంద్రకుమార్, ఇంద్రకుమార్, హారిక, రాయల, వాసుదేవరావు, జానకీరామయ్య, రమాలక్ష్మి, సీతారామశాస్త్రి, సురభి కొండల్ రావు వివిధ పాత్రలు పోషించారు.

యువకుడి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన ఓ యువకుడి వేధింపులు తాళలేక వివాహిత కందిమళ్ల సుష్మ (26) ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందిమళ్ల లక్ష్మయ్యతో ఏడేళ్ల క్రితం కొణిజర్ల మండలం సిద్దిక్‌నగర్‌కు చెందిన సుష్మకు వివాహం జరగగా, ఇద్దరు పిల్లలు జన్మించారు. ఏడాది కాలంగా వీరి ఇంటి సమీపంలో ఉండే పర్సగాని గోపి సుష్మను పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన లక్ష్మయ్య, కుటుంబీకులు హెచ్చరించినా వేధింపులు ఆగలేదు. దీంతో మంగళవారం ఉదయం భర్త లక్ష్మయ్య పాలు విక్రయించేందుకు ఖమ్మం వెళ్లాక పిల్లల్ని పాఠశాలకు పంపించిన సుష్మ చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై భర్త లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదుతో గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

నేడు ప్రత్యామ్నాయ పౌరసమాజం ఆధ్వర్యాన సదస్సు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో 'కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర విధానాలు–విషాద పరిణామాలు' అంశంపై బుధవారం సదస్సు ఏర్పాటుచేసినట్లు ప్రత్యామ్నాయ పౌరసమాజం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు మొదలయ్యే ఈ సదస్సుకు రాజకీయ విశ్లేషకులు, వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లలో రాజకీయ, ఆర్థిక స్థితిగతులు, ధ్వంసమైన రాజ్యాంగ విలువలు తదితర అంశాలపై చర్చ ఉంటుందని, ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యావంతులు హాజరుకావాలని కోరారు.

భూ క్రయవిక్రయాలపై వివాదం

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి అయ్యగారిపేట రెవెన్యూలో భూక్రయవిక్రయాలపై వివాదం నెలకొంది. ఈ ప్రాంత రైతులు ఏళ్ల క్రితం పశువులను మేపేందుకు, నీటి నిల్వ కోసం తలా కొంత భూమిని వదిలేయగా రెండుచోట్ల 24 కుంటల భూమి మిగిలింది. ఈ భూమి పడావుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదవుతుండగా ఇటీవల భూమి పక్కన పొలం కలిగిన రైతులకు గ్రామస్తులు విక్రయించారు. తొలుత కుంటకు రూ.లక్ష చొప్పున అమ్మాలని భావించినా పలువురు అభ్యంతరం చెప్పడంతో ఇటీవల మొత్తంగా రూ.కోటికి విక్రయం పూర్తయింది. ఈ డబ్బుతో గ్రామంలోని పాత రామాలయాన్ని పునఃనిర్మించాలని తీర్మానించారు. అయితే, ఆలయానికి భూమి సరిపోదంటూ రూ.10లక్షలు కూడా విలువ చేయని కుంట స్థలాన్ని రూ.20లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారని కౌన్సిలర్ దేవరపల్లి ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కొందరు స్థలాల విలువ పెరిగేందుకు ఇలా చేశారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రుణం ఇప్పిస్తానని నమ్మించిన కేటుగాడు

మహిళ నుంచి నగదు, ఫోన్ కాజేసిన వైనం

బోనకల్: ఓ వితంతువుకు రుణం ఇప్పిస్తానని నమ్మించిన గుర్తు తెలియని వ్యక్తి నగదు, సెల్‌ఫోన్ లాక్కుని వదిలేసిన ఘటన ఇది. ఎస్‌ఐ తేజావత్ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. ఐదు రోజుల క్రితం కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో సైదులు దగ్గరకు వచ్చిన తెలియని వ్యక్తి వచ్చి ముస్లిం, మైనార్టీల్లో పేదల మహిళలకు రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో సైదులు తన బంధువులైన మధిర మండలం ఖమ్మంపాడు వాసి మీరాబీ ఫోన్ నంబర్ ఇచ్చాడు. సదరు వ్యక్తి ఆమెనుసంప్రదించి రుణం కావాలంటే రూ.10వేల నగదు, ఆధార్‌కార్డుతో బోనకల్‌కు రావాలని చెప్పగా ఆమె తన మామతో కలిసి మంగళవారం వచ్చింది. దీంతో ఆమె మామను అక్కడే ఉంచి మీరాబీ సంతకాలు కావాలని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. బోనకల్ హైస్కూల్ వద్ద ఆమెను దించి రూ.8 వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని మీరాబీ మామను తీసుకొస్తానని వెళ్లిపోయాడు. అయితే, రెండు గంటలు గడిచినా రాకపోవడంతో ఆమె మామ అటు మీరామీ, సదరు వ్యక్తికి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంతలోనే మీరాబీ స్థానికుల నుంచి ఫోన్ తీసుకుని బంధువులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, మహిళ కిడ్నాప్ అయినట్లుగా ప్రచారం జరగడం, ఆతర్వాత ఆమె ఆచూకీ లభించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వడదెబ్బతో ఆటోడ్రైవర్ మృతి



సైదులు (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ గోపాలపురానికి చెందిన ఆటోడ్రైవర్ గుగులోత్ సైదులు(28) వడదెబ్బ బారిన పడగా మంగళవారం మృతి చెందాడు. ఆటో కిరాయికి వెళ్లి వచ్చిన ఆయన అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమేరకు ఆయన భార్యాపిల్లలను కార్పొరేటర్ లకావత్ సైదులు పరామర్శించారు.

కన్నుమూసి తెరిచే లోగా వాహనం చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెం వాసి పెరుమాళ్లపల్లి చంద్రశేఖర్‌కు చెందిన ద్విచక్రవాహనం మంగళవారం చోరీకి గురైంది. ఖమ్మం వెళ్లి తిరిగి వస్తున్న ఆయన ఎండ కారణంగా విశ్రాంతి తీసుకునేందుకు ఏదులాపురం శివారు తాళ్లేసే తండా వద్ద పక్కన వాహనాన్ని ఆపి బల్లపై పడుకున్నాడు. కాసేపటికి లేచి చూడగా వాహనం లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట

జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు



అదనపు తరగతి గదులను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, అదనపు కలెక్టర్ స్నేహలత

బోనకల్: రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. మండలంలోని కలకోట పాఠశాలలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను అదనపు కలెక్టర్ స్నేహలతతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక విద్యారంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మండలంలోని ముష్టికుంట్ల, లక్ష్మీపురంల్లో ఏర్పాటుచేసిన గ్రంథాలయాలను అదనపు కలెక్టర్ స్నేహలత ప్రారంభించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో యువతకు గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. ఈకార్యక్రమాల్లో తహసీల్దార్ రమణి, జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంపీఓ శాస్త్రి, సర్పంచ్‌లు యంగల దయామణి, షేక్ బీజాన్‌బీ, నన్నక లక్ష్మి, ఎంఈఓ ఇందిరాజ్యోతి, మధిర మార్కెట్ చైర్మన్ బందం శ్రీనుతో పాటు రామారావు, వేమూరి ప్రసాద్, బానోతు కొండ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో సత్తా చాటిన ఆటోడ్రైవర్ కుమారుడు



పాంటింగ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్, తదితరులు

వైరా: నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు ఆ విద్యార్థి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. వైరా మున్సిపాలిటీ పరిధి 1వ వార్డుకు చెందిన చింతపల్లి బెనర్జీ, స్వప్న దంపతుల కుమారుడు పాంటింగ్ పదో తరగతి వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి 10 జీపీఏ, ఇంటర్ ఎంపీసీ ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలో చదివి 877 మార్కులు సాధించాడు. అంతేకాక ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్‌లో 20 వేల ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 324వ ర్యాంకు సాధించాడు. తద్వారా దేశంలోని ప్రతిష్టాత్మక నిట్‌లో సీటు వచ్చే అవకాశముంది. వైరాలోనే ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివించిన బెనర్జీతో పాటు పాంటింగ్‌ను విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం వైరా ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వార్డు కౌన్సిలర్ మరికంటి డేడీ కుమారి, హెచ్‌ఎం నాగబత్తిని స్వప్న సన్మానించారు.

సీఎల్పీ నేత భట్టికి పరామర్శ



భట్టిని పరామర్శిస్తున్న దుర్గాప్రసాద్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: వడదెబ్బ, జ్వరంతో బాధపడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను జిల్లా కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పాదయాత్రలో భాగంగా సూర్యాపేట జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లిలో బస చేసిన ఆయనను మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ తదితరులు పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

పాఠాలు బాగా చెబుతున్నారా?



విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న కలెక్టర్

రఘునాథపాలెం: పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయి.. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా అని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆరా తీశారు. రఘునాథపాలెంలోని కేజీబీవీకి మంగళవారం వచ్చిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని ప్రిన్సిపాల్ లత చెప్పగా, గత ఏడాది పుస్తకాలతో బోధన చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. డీఈఓ సోమశేఖర్‌శర్మ, ఎంఈఓ ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘మార్గదర్శి’పై దర్యాప్తు

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, హైదరాబాద్ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసమే ఆ సంస్థలో అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని, అది తమ బాధ్యత అని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లిస్తుండటంతో ఖాతాదారులకు నష్టం కలగకుండా ఇప్పటికే రూ.1,035 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులను అటాచ్ చేసినట్టు తెలిపారు. మార్గదర్శి కంపెనీ ఏ కారణంగానైనా మూతపడితే ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీపై ఉంటుందని తెలిపారు. మార్గదర్శి సంస్థ ప్రతి చట్టాన్ని, నిబంధనను అతిక్రమించిందని, ఇంకా అతిక్రమిస్తూనే ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 9 బ్రాంచ్‌లలో 23 గ్రూప్ చిట్స్‌ను, వాటికి సంబంధించి రూ.604 కోట్ల టర్నోవర్ నిలిపివేసినట్టు చెప్పారు. ఇదే తరహాలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని ఇతర బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలపై ఆధారాలు లభిస్తే.. వాటిలోని చిట్ గ్రూప్‌ల టర్నోవర్ నిలిచిపోతుందని చెప్పారు. చివరకు మార్గదర్శి పడిపోతుందన్నారు.

సంజయ్ మంగళవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మూడేళ్ల లావాదేవీలను పూర్తిగా పరిశీలించి, అక్రమాలపై ఆధారాలు సేకరించామన్నారు. ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 108 బ్రాంచ్‌లలో కార్యకలాపాలపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర ఏజెన్సీలకు కూడా ఈ అక్రమాల సమాచారం ఇచ్చామని, తెలంగాణ, ఇతర రాష్ట్రాల డీజీపీలకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఫిర్యాదు మేరకే ఏపీ సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని తెలిపారు. పూర్తి నిబంధనలు పాటిస్తూనే ఈ కేసులో ఏ-1 రామోజీరావును, ఏ-2 శైలజాకిరణ్‌ను ప్రశ్నించామన్నారు.

ఖాతాదారులను మభ్యపెడుతున్నారు

మార్గదర్శి అక్రమాలపై ఖాతాదారుల నుంచి ఫిర్యాదు లేకుండానే కేసు దర్యాప్తు చేస్తున్నారంటూ ఒక సెక్షన్ మీడియా ఆరోపణలు చేస్తోందని, అయితే ఖాతాదారులకు వడ్డీని ఆశజూపి ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లిస్తుండటాన్ని తాము వెలుగులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేసేకంటే ముందే తాము వారి సొమ్ము కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఏ బాధితుడి విషయంలో అయినా ఇదే పద్ధతి అని స్పష్టం చేశారు. చాక్లెట్ ఇచ్చి బాలికను కిడ్నాప్ చేస్తే.. సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు కానీ, బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేవరకు కూర్చోరని.. అదే తరహాలో లక్షల మంది ఖాతాదారుల సొమ్మును కాపాడేందుకు మార్గదర్శిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు న్యాయం చేస్తుంటే మార్గదర్శిపై కక్షసాధింపు అంటూ ఆ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ దర్యాప్తు చట్టానికి లోబడి ఉన్నట్టే.. చిట్‌ఫండ్స్ కంపెనీ నిర్వహణలో రామోజీరావు సైతం చట్టానికి లోబడి ఉండాలన్నారు.

చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా ఏకంగా 26 ఏళ్లు అడ్డుకున్నారు

మర్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను చిట్‌ఫండ్ యాక్ట్ 1982 మేరకు నడపడంలేదని అన్నారు. చిట్‌ఫండ్స్ సొమ్ముతో వేరే వ్యాపారం చేయకూడదన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారమే బ్యాలెన్స్ షీట్లు ఫైల్ చేయాల్సి ఉన్నా.. కంపెనీ యాక్ట్స్ ప్రకారం నడుచుకుంటున్నామని ఈ కేసులో ఏ-2 శైలజాకిరణ్ అవివేకంతో కూడిన సమాధానాలు చెప్పారని తెలిపారు. ఒక గ్రూప్ డబ్బు మరో గ్రూప్‌కు వాడొద్దని చట్టం చెబుతున్నా.. మార్గదర్శి బ్రాంచ్‌లన్నింటిలోని డబ్బు అక్రమంగా హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్టు అన్ని ఆధారాలు లభించాయని చెప్పారు. చిట్‌ఫండ్ యాక్ట్ రావడానికి ముందే మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ప్రారంభమైందన్న వింత వాదన తెస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 1982లో చిట్‌ఫండ్ యాక్ట్ పాస్ చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో పాస్ చేయాల్సి ఉందన్నారు. కానీ 26 ఏళ్ల తర్వాత 2008లో అమలు చేశారని, ఇన్నేళ్లూ రామోజీరావు పలుకుబడితో అడ్డుకున్నారని వివరించారు.

నిబంధనలున్నా.. వారికి అనుకూలంగా వాడారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ లావాదేవీలు చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కాకుండా రామోజీరావు, శైలజా కిరణ్ వారికి అనుకూలంగా కంపెనీ యాక్ట్ ప్రకారం చూపుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. తమకు ఆ నిబంధనలు వర్తించవన్న తరహాలో సమాధానాలిచ్చారన్నారు. ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలుకు మాత్రం చిట్‌ఫండ్స్ చట్టాన్నే వాడుకొంటున్నారని చెప్పారు. ఇదే తరహాలో చీరాలలో రూ.65 లక్షల డిఫాల్ట్ కేసులో ష్యూరిటీగా ఉన్న వ్యక్తి నుంచి రూ.6 కోట్లు విలువైన ఆస్తిని అటాచ్ చేయించారని తెలిపారు. ఇలాంటి ఎన్నో అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయన్నారు. సంస్థలోని అంతర్గత లుకలుకలు బయటపడతాయనే చిట్‌ఫండ్స్ యాక్ట్‌ను అమలు చేయడంలేదన్నారు.

చిట్ సెటిల్‌మెంట్‌లోనూ నిబంధనలు పాటించడంలేదన్నారు. చిట్ ముగిసిన వారి వివరాలతో, కొన్నింటిలో మానేసిన ఖాతాదారుల పేర్లు వాడి మళ్లీ చిట్‌లు నడుపుతున్నారని, ఇలా ఎన్నో విస్తుపోయే ఆధారాలు లభించాయని తెలిపారు. చిట్ డబ్బు బ్రాంచ్‌లో లేకపోవడంపై ప్రశ్నిస్తే.. మీరెవరు ప్రశ్నించేందుకు అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారన్నారు. చట్టానికి వారు సహకరించడం లేదని చెప్పారు.

తొక్కతీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?

ఎమ్మెల్యే ద్వారంపూడిని దూషించేందుకు మీ సమయాన్ని వృథా చేయొద్దు

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కాపునేత ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒకపక్క టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తానంటూ మరోపక్క తనను ముఖ్యమంత్రిని చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కలసి పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయమని ఎలా అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. పవన్ 175 స్థానాల్లో పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయాలని కోరడం తప్పు కాదన్నారు. ఓ పార్టీని స్థాపించాక పదిమంది ప్రేమను పొందాలేగానీ వీధి రౌడీ భాషలో మాట్లాడటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు పవన్‌ను ఉద్దేశించి రాసిన లేఖను ముద్రగడ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న తీరు, ప్రజా ప్రతినిధులపై ఉపయోగిస్తున్న పరుష పదజాలాన్ని లేఖలో ముద్రగడ తీవ్రంగా తప్పుబట్టారు. ‘ఈ లేఖ రాసినందుకు మీకు ఎక్కడా లేని కోపం రావచ్చు. మీ కోట్లాది మంది అభిమానులు నన్ను తుదిముట్టించే ప్రయత్నం చేయవచ్చు. అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా రాయక తప్పడం లేదు’ అని అందులో పేర్కొన్నారు.

రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు

కులాన్ని అడ్డం పెట్టుకుని నేను నాయకుడిగా ఎదగలేదు. కులాన్ని అడ్డు పెట్టుకుని ఎప్పుడూ ఏ పదవీ పొందలేదు. యువతను వాడుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగ్గంపేట సభలో రిజర్వేషన్ల అంశం తన చేతిలో ఉండదని, అది కేంద్రం పరిధిలో ఉందని అన్నప్పుడు నేను ఇచ్చిన సమాధానం ఏమిటో పవన్ ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యన్నారాయణలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయమని కోరా. నేను కోట్లాది రూపాయల కోసం, సూట్‌కేసులకు అమ్ముడు పోవడానికి ఉద్యమం చేయలేదు. నాకంటే చాలా బలవంతుడైన పవన్ నేను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి కాపు యువతకు రిజర్వేషన్ ఫలాలను ఎందుకు సాధించలేదో చెప్పాలి. పవన్‌కు రాజకీయ సలహాలు ఎవరిస్తున్నారో నాకు తెలియదు. ఆయన మాట్లాడే భాష వల్ల నష్టమేగానీ లాభం ఏమాత్రం ఉండదు. ‘తొక్క తీస్తా.. నార తీస్తా.. కింద కూర్చోబెడతా.. చెప్పుతో కొడతా.. గుండు గీయిస్తా..!’ లాంటి వ్యాఖ్యలు పదేపదే చేస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమందిని అలా చేశారో ఆయనే చెప్పాలి. పవన్ గతంలో నావద్దకు రాయబారులను పంపిస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ప్లాంట్ తదితర సమస్యలపై పోరాడాలని సూచించా. పవన్‌కు నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఈ సమస్యలపై యుద్ధం చేయాలి. అంతేకానీ నాలాంటి అనాథలపై కాదు.

ముడుమాల్ నిలువురాళ్లపై అధ్యయనం

- డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో రాష్ట్ర వారసత్వ శాఖ ఒప్పందం
- వారసత్వ హోదాకు యునెస్కోకు దరఖాస్తు
- నేటి నుంచి అధ్యయనం షురూ



ఒప్పందం పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసగౌడ్



సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు వేల ఏళ్ల క్రితం ఆది మానవులు ఏర్పాటు చేసిన నిలువురాళ్ల(మెన్హిర్స్)పై అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం జరగబోతోంది. నారాయణపేట జిల్లాలోని ముడుమాల్‌లో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో వేల సంఖ్యలో నిలువు రాళ్లు ఉన్నాయి. ఇందులో కొన్ని 20 అడుగుల ఎత్తుతో ఉన్నాయి. పొడవాటి పెద్ద శిలలు దాదాపు 80 వరకు ఉండగా, చిన్నవి మూడు వేల వరకు ఉన్నాయి. ఇవి క్రీ.పూ.2 వేల ఏళ్ల కంటే పాతవని చరిత్ర పరిశోధకులు అభిప్రాయం. యునెస్కో గుర్తింపు పొందిన లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో ముడుమాల్ నిలువు రాళ్లకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఇంతకాలం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతూ వచ్చింది. ఇన్నేళ్లకు వాటి ప్రత్యేకతలపై ఆధునిక పద్ధతిలో అధ్యయనం, డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు. చాలా రాళ్లు ఒంగిపోగా, కొన్ని కూలిపోయాయి. గతంలో అవి ఎలా ఉండేవో గుర్తించి వాటిని సరిచేసి ఆ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించేందుకు ఎట్టకేలకు తెలంగాణ వారసత్వ శాఖ సిద్ధమైంది. ఆ మేరకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో ఆ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. కొద్ది రోజుల క్రితమే ఆ ఒప్పందం జరగ్గా, మంగళవారం అందుకు సంబంధించిన పత్రాలను మంత్రి శ్రీనివాసగౌడ్ అందజేశారు.

ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్

ట్రస్టు చైర్మన్ వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.పుల్లారావు, , ఏఎస్ఐ విశ్రాంత అధికారులు బాబ్జీరావు, తాహెర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ హరగోపాల్, మొయినాబాద్‌లోని జేబీఆర్ ఆర్కిటెక్ట్ కాలేజీ స్కాలర్లు తదితరులు ఈ ప్రాంతంపై ఏడాది కాలంపాటు అధ్యయనం, ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు.

నక్షత్రాల వరుసను పోలిన...

ఆదిమానవుల కాలంలో మృతి చెందిన ప్రముఖుల సమాధి వద్ద నిలువురాళ్లకు స్మారకంగా పాతడం ఆనవాయితీ. వాటని మెన్హిర్స్ అంటారు. ముడుమాల్‌లోని నిలువురాళ్లు కూడా అలాంటి స్మారక శిలలే. అయితే వాటిని ఒకేచోట ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయటం ద్వారా అప్పట్లో ఖగోళ పరిశోధనశాలగా వినియోగించారని పరిశోధకులు గతంలో గుర్తించారు. సూర్యుడు గమనం వల్ల ఆ రాళ్ల నీడల్లో వచ్చే మార్పుల ఆధారంగా వాతావరణాన్ని అంచనా వేసేవారని, అక్కడి ఓ రాతిపై సప్తర్షి మండలం (ఉర్సా మేజర్)గా పేర్కొనే నక్షత్రాల వరసను పోలి ఉండటాన్ని గతంలో పరిశోధకులు గుర్తించారు. లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్ వద్దకూడా అలాంటి ఏర్పాటే ఉండటం విశేషం. ఇప్పుడు లోతైన అధ్యయనం ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోనున్నారు. ఈమేరకు మంగళవారమే వేదకుమార్, కేపీఆర్ తదితరులు పరిశోధనల కోసం ముడుమాల్ వెళ్లారు.

నేడు అతి తాపపు రోజు కావడంతో

జూన్ 21 వేసవి అతి తాపపు రోజు. ఆ రోజు సూర్యుడి గమనంలో మార్పు వస్తుంది. ఇది పరిశోధనలకు మరింత అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో వెంటనే పని ప్రారంభించినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో దీని ప్రత్యేకతలు మరిన్ని వెలుగులోకి వస్తే, దాని ఆధారంగా ఈ ప్రాంతాన్ని ప్రపంచ వారసత్వ హోదా గుర్తింపు కోసం యునెస్కోకు దరఖాస్తు చేయనున్నారు.

కాలుష్యంపై పోరుబాట



భిక్కనూరు ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రం సమీపంలోని ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మంగళవారం కాచాపూర్, అయ్యవారిపల్లి, మాందాపూర్, సంగమేశ్వర్ అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ముట్టడించారు. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లుతున్న వ్యర్థాలు, విష వాయువులను నివారించాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 57వ రోజుకు చేరుకున్నాయి. యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోడంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి, ఐదు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ ముట్టడికి బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దమల్లారెడ్డి గ్రామశివారులోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద వారిని అడ్డుకున్నారు. కామారెడ్డి డీఎస్పీ సురేశ్ ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డిని వెంటబెట్టుకుని వచ్చారు. వీడీసీ అధ్యక్షుడు మైపాల్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల వాతావరణంతో పాటు నీరు కలుషితమవుతోందని, ప్రజల ఆరోగ్యం చెడిపోతోందని తెలిపారు. ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తామని ఫ్యాక్టరీ ప్రతినిధి రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఐదు గ్రామాల నుంచి మొత్తం ఐదుగురిని కమిటీలోకి తీసుకుంటామని, డీఎస్పీతో పాటు ఫ్యాక్టరీ సిబ్బంది ఐదుగురు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామనడంతో ధర్నాను విరమించారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో తగ్గిన నీటిమట్టం




కిన్నెరసాని రిజర్వాయర్‌లో తగ్గిన నీరు

పాల్వంచరూరల్: భానుడి భగభగతో జనం ఇబ్బంది పడుతుండగా.. కిన్నెరసాని జలాశయంలోని నీటిమట్టం కూడా తగ్గింది. జలాశయం నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, నిత్యం 90క్యూసెక్కుల నీటిని కేటీపీఎస్, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి అవసరాలకు వదులుతున్నారు. దీనికి తోడు ఎండల కారణంగా మంగళవారం రిజర్వాయర్‌లో నీటిమట్టం 398.30 అడుగులకు చేరింది. కాగా, గతేడాది ఇదేరోజున 397 అడుగులు గా ఉందని అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే నీరు ఎక్కువగానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నా.. మరికొన్ని రోజులు వర్షాలు పడకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని తెలుస్తోంది.

‘నవోదయ’లో ఆరో తరగతి ప్రవేశాలు

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 10లోగా www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వచ్చే ఏడాది జనవరి 20న పరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదోతరగతి చదివి, 01-05-2012 నుంచి 31-07-2014 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణపత్రం ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలయాల్లో కొత్త కాంతులు



పునర్నిర్మాణ నిధులతో రూపుదిద్దుకున్న పాల్వంచలోని శ్రీరామాలయ భజనమందిరం

- ధూప దీప నివేదన.. నిత్యపూజలతో శోభ
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా అభివృద్ధి
- సర్వశ్రేయ నిధుల ద్వారా పలుచోట్ల ఆలయాల పునర్నిర్మాణం

నేడు ‘ఆధ్యాత్మిక దినోత్సవం’

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ఏర్పడ్డాక పలు ఆలయాలకు కొత్తకళ సంతరించుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన అనేక దేవాలయాలు నేడు భక్తుల ఆరాధనలతో పునరుజ్జీవం పొందాయి. శిథిలావస్థలో ఉన్న పురాతన ఆలయాలు పునర్ వైభవాన్ని సంతరించుకోగా, ధూప, దీప, నైవేద్య పథకంతో నిత్య పూజలు జరుగుతున్నాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డీడీఎన్‌తో నిత్యపూజలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు ఆలయాలు నిర్లక్ష్యానికి గురవుతూ శిథిలావస్థకు చేరుతున్న క్రమాన ధూప దీప నివేదన పథకం ఆదుకుంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే ఈ పథకం ప్రారంభించగా.. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 115 దేవాలయాలను ఎంపిక చేశారు. అంతేకాక అర్చకులకు రూ.2,500 గౌరవ వేతనం అందేది. తెలంగాణ ఏర్పడ్డాక మరో 123 ఆలయాలను ఈ జాబితాలో చేర్చి మొత్తం 238 దేవాలయాల్లో పథకాన్ని అమలు చేస్తూ గౌరవ వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాడు 18 దేవాలయాలకు అమలైన ధూపదీప నివేదన పథకం ఇప్పుడు 63 దేవాలయాలకు విస్తరించింది. తాజాగా ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో మరో 67 ఆలయాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 35 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక అర్చకుల వేతనం, ధూప దీప నివేదన పథకం అమలుకు ఒక్కో ఆలయానికి రూ.10 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తమవుతోంది.

సర్వశ్రేయ నిధుల ద్వారా పునర్నిర్మాణం

తెలంగాణ ఏర్పడ్డాక ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేలా పునర్‌నిర్మించేందుకు సర్వశ్రేయ నిధి పేరుతో నిధులను మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాలో 40 దేవాలయాలను రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లతో అభివృద్ధి చేసింది. ఇటీవల ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిగొండ మండలం ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జ్ఞాన మందిరం నిర్మాణానికి కూ.75 లక్షలు మంజూరు చేశారు. అలాగే, దాతల పథకం ద్వారా రూ.4.29 కోట్లు, బలహీన వర్గాలు ఉండే ప్రాంతాల్లో ఏడు దేవాలయాలను రూ.84 లక్షలతో అభివృద్ధి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సర్వశ్రేయ పథకం కింద రూ.7.33 కోట్లతో 13 దేవాలయాలను అభివృద్ధి చేయగా.. సీజీఎఫ్ నిధులు రూ.5.10 కోట్లతో ఆరు దేవాలయాలు, దాతల విరాళాలు రూ.1.87 కోట్లతో నాలుగు ఆలయాల పునర్నిర్మాణం చేపట్టారు. అంతేకాక బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో ఉన్న మూడు దేవాలయాలను రూ.36 లక్షలతో అభివృద్ధి చేశారు.

ఆధ్యాత్మిక దినోత్సవానికి ఏర్పాట్లు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 420 దేవాలయాల్లో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల వైభవాన్ని చాటేలా.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైష్ణవాలయాల్లో సుదర్శన హోమాలు, శివాలయాల్లో మహా రుద్రాభిషేకంతో పాటు వేద పారాయణం, చండీహోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఖమ్మం శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర, వాసవీ గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణం జరపనున్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్తమ సేవలందించిన దేవాదాయ శాఖ ఉద్యోగులు ముగ్గురికి ప్రశంసాపత్రాలు అందిస్తారు. ఇవేగాక నూతనంగా ధూప దీప నివేదన పథకానికి ఎంపికైన దేవాలయాల బాధ్యులకు ఉత్తర్వులు అందజేస్తారు.

పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలి..



తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించనున్నాం. అన్ని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపిస్తాం. భక్తులు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలి.

–ఎ.సులోచన, ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ

అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు

గౌతమీనగర్ కాలనీలో ఒడిశా ఉద్యోగుల ఆధ్వర్యాన నిర్వహణ



రథయాత్రలో జీఎం థాలే, తదితరులు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలిచే అశ్వాపురంలోని భారజల కర్మాగారం ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించగా మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే ప్రారంభించారు. ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగే జగన్నాథ రథయాత్రను తలపిస్తూ గత 23 ఏళ్లుగా భారజల కర్మాగారంలో విధులు నిర్వర్తించే ఒడిశా రాష్ట్ర అధికారులు, ఉద్యోగులతో ఏర్పడిన ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతామూర్తులకు తొలిరోజు ఆద్యాపూజ, మధ్యాహ్న పూజ, పహాండి, ఛెరపహారా నిర్వహించారు.

కోలాహలంగా రథయాత్ర

జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ప్రతిష్ఠించి గౌతమీనగర్ కాలనీ పురవీధుల్లో మేళతాళాలు, కోలాటాలు, నృత్యాల నడుమ ఊరేగించారు. ఆతర్వాత ఉత్కల్ పతాగర్ మండపం ఎదుట రథం వద్దకు చేర్చి పూజలు చేశారు. తొలుత రథయాత్రను ప్రారంభించిన భారజల కర్మాగారం జీఎం కే.వీ.థాలే ఛెరపహారా(చీపురుతో రథం శుభ్రం చేయు ట) నిర్వహించారు. అనంతరం ఒడిశా వాసులతో పాటు వివిధ రాష్ట్రాల ఉద్యోగులు ఇరువైపులా బారులుదీరి రథాన్ని లాగారు. కాగా, తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలు ఈనెల 28న బాహుదా యాత్రతో ముగియనున్నాయి. భారజల కర్మాగారం అధికారులు, ఉత్కల్ పతాగర్ కమిటీ అధ్యక్షుడు ఆర్.ఫాణిగ్రాహి, కమిటీ సభ్యులు బలరాంసాహు, సరోజ్‌దాసు, మదన్‌మోహన్‌సాహు, ఉద్యోగులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భద్రాచలం వాసికి హరితోత్సవ పురస్కారం



మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భూపతిరావు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో భద్రాచలంవాసికి పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన సమావేశంలో భద్రాచలానికి చెందిన గోళ్ల భూపతిరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హరితోత్సవ పురస్కారాన్ని అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకిరణ్‌రెడ్డి అందజేశారు. ఏడాది కాలంలో మొక్కల సంరక్షణకు చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని, తన పేరు ప్రతిపాదించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక కార్యాచరణతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ డేవిడ్‌రాజ్

బూర్గంపాడు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. మండలంలోని ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, విద్యార్థులు సైతం ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, నైట్‌డ్రెస్‌లను ఏపీఓ అందజేశారు. కార్యక్రమంలో పీఎంఆర్‌సీ ఏసీఎంఓ రమణయ్య, హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకే రూ.లక్ష పథకం

- అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెబితేనే లబ్ధి
- ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: వెనుకబడిన వర్గాల కోసం ప్రకటించినట్లు చెబుతున్న రూ.లక్ష ఆర్థిక సాయం పథకం బీఆర్‌ఎస్ కార్యకర్తల కోసమేనని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఈ పథకం ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి పైరవీలు లేని అత్యధికులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందలేదని, పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. ఇక మీ సేవలో చేసిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయ బాక్సుల్లో వేస్తే తెరిచే వారే కానరావడం లేదని చెప్పారు. మరోవైపు విద్యార్థుల సర్టిఫికెట్లను పక్కకు పెట్టి ఈ దరఖాస్తుల పరిశీలనపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని ధ్వజమెత్తారు. దీనికి తోడు రూ.లక్ష పథకం విషయంలో పైరవీలు ఊపందుకున్నాయని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన దరఖాస్తులను పరిష్కరించి మిగతా వారిని పెండింగ్‌లో పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ బీసీ కార్యకర్తలు చేజారకుండా ఉండేందుకే కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం రూ.లక్ష సాయం పథకాన్ని ప్రవేశపెట్టిందని పొంగులేటి ఆరోపించారు.